నోరు తెరిస్తే అబద్ధాలే..!

- బీజేపీ నేతలు మల్లాపూర్‌కు ఒక్క రూపాయీ తేలేదు
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపణ

ఇందల్‌వాయి: బీజేపీ నాయకులు నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడటం తప్ప ఏ ఒక్క అభివృద్ధికి నిధులు తెచ్చే సామర్థ్యం లేదని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. మల్లాపూర్‌లో రూ.96.50 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. వేంకటేశ్వర ఆలయంలో రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, రూ.67 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.6 లక్షలతో నిర్మించిన క్రీడా ప్రాంగణం, రూ.10.50 లక్షలతో నిర్మించిన వైకుంఠధామం, రూ.4 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, రూ.4 లక్షలతో నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. మల్లాపూర్ గ్రామానికి స్థానిక ఎంపీ ఒక్క రూపాయి నిధులైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రూ.5 కోట్ల ఎంపీ ఫండ్ వస్తున్నా ఏ ఒక్క గ్రామానికి రూపాయి ఇచ్చిన ముఖం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశంపై వంద లక్షల కోట్ల అప్పు చేసి, అదానీ అంబానీలకు కట్టబెట్టడమే తప్ప దేశాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. దేశాన్ని అప్పుల కుప్ప చేస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి వర్గానికి ఏదో ఒక రకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, సుమనారవిరెడ్డి, ఎంపీపీ రమేశ్ నాయక్, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, వైస్ ఎంపీపీ అంజయ్య, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సరితసుధీర్, తదితరులు పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

'నిధులు మంజూరు చేయండి'

డిచ్‌పల్లి: బర్ధీపూర్‌లో నిర్మించ తలపెట్టిన రెడ్డి సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని ఆదివారం బర్ధీపూర్ రెడ్డి సంఘం ప్రతినిధులు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి విన్నవించారు. గతంలో రెడ్డి సంఘ భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో త్వరగా నిధులు మంజూరు చేయాలని కోరారు. బాజిరెడ్డి గోవర్ధన్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. దీంతో రెడ్డి సంఘాల ప్రతినిధులు పుష్పగుచ్ఛంతో ఆర్టీసీ చైర్మన్‌ను సన్మానించారు. సంఘం అధ్యక్షులు కిష్టారెడ్డి, పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

జక్రాన్‌పల్లి : కొలిప్యాక్‌లో వచ్చే నెల 2 నుంచి నిర్వహించనున్న శ్రీ ఆనంద గిరి లక్ష్మీ నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కొలిప్యాక్ గ్రామస్తులు ఆహ్వానించారు. ఆదివారం నిజామాబాద్‌లోని ఆయన స్వగృహంలో గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఉత్సవాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆత్మకూరి బాలయ్య, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు రవి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు

సిరికొండ : కుర్దుల్‌పేట్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినందుకు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీకి సొంత భవనం, సీసీ రోడ్లకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ ద్యాగ గంగాధర్, ఎంపీటీసీ గాండ్ల సతీష్, బీఆర్ఎస్ నాయకులు ద్యాగ గంగాధర్, పెద్దోళ్ల ఆదిత్య, చిన్నోళ్ల గంగాధర్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

- బీజేపీ నేత కులాచారి దినేష్

సిరికొండ : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే ఏమాత్రం అభివృద్ధి చేయలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కులాచారి దినేష్ ఆరోపించారు. మండలంలోని 38 బూత్‌లలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం లొంకలో పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో దినేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి కూడా నియోజకవర్గంలో ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు తేలేదని విమర్శించారు. నియోజకవర్గంలో రోడ్లు బాగా లేవని, ఇందల్‌వాయి-ధర్పల్లి మధ్యలో రోడ్డు చెడిపోయి ఇద్దరు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బీజేపీ శ్రేణులను నానావిధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కార్యకర్తలు ఎవ్వరు కూడా అధైర్యపడాల్సిన పని లేదని వారికి అండగా నేనుంటానని పేర్కొన్నారు. పోడు దారులకు పట్టాలు ఇవ్వకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధరణితో అన్నదాతలు అరిగోస పడుతున్నారని వాపోయారు. పార్టీ అభ్యున్నతి కోసం తెచ్చిన సరళ్ యాప్‌లో ఎక్కువ మందిని నమోదు చేయించాలని తెలిపారు. నియోజకవర్గంలో 2.40 లక్షల ఓట్లు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో 1.40 లక్షల ఓట్లు సాధిస్తామన్నారు. పార్టీని మరింత క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గద్దె భూమన్న, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అనంత పద్మారెడ్డి, మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నేత కులాచారి దినేష్

చైర్‌పర్సన్‌కు మద్దతు తెలిపిన పద్మశాలి మహిళలు



నిజామాబాద్‌నాగారం : జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి మహిళా విభాగం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, కార్యదర్శి అమరవిక, నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు గుడ్ల చంద్రబాగ, ఉపాధ్యక్షులు కొండి సుధ కలిసి మద్దతు తెలిపారు. రాజేశ్వరి మాట్లాడుతూ.. బీసీ సోదరికి అవమానం భరించలేక తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. శ్రావణి కంటతడి బీసీలను కదిలించిందన్నారు. అధిష్టానం చొరవ తీసుకొని బోగ శ్రావణిని చైర్మన్ పదవిపై కూర్చోబెట్టి తగిన న్యాయం చేయాలన్నారు. ఆమెకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా తెలంగాణ వ్యాప్తంగా మహిళలు అండగా ఉంటారన్నారు.

కార్యకర్తలపై కేసులు ఎత్తేయండి

సుభాష్‌నగర్: ఎన్నికల మేనిఫెస్టో మేరకు ఇంటికో ఉద్యోగమివ్వాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి కేటీఆర్‌ను అడ్డుకున్నందుకు బీజేవైఎం కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు ఆదివారం డిమాండ్ చేశారు. యువ మోర్చా కార్యకర్తలపై పోలీసుల లాఠీఛార్జీ చేసి, రిమాండ్‌కు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. హామీలు అమల్జేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు.

డివిజన్ల నూతన కమిటీ ఎన్నిక



సుభాష్‌నగర్: నగరంలోని సీపీఐ కార్యాలయంలో 8, 29వ డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. నగరంలో అనేక డివిజన్లలో ప్రజలు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లు, చెత్త సేకరణ, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇతరత్ర సమస్యలు ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి ప్రజలను కలుపుకుని నాయకులు పోరాడాలని పేర్కొన్నారు. అనంతరం ఆయా డివిజన్ల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. 8వ డివిజన్ కార్యదర్శిగా పిన్నెల హన్మాండ్లు, 29వ డివిజన్ కార్యదర్శిగా బాల్‌లింగంతోపాటు కమిటీ సభ్యులుగా ఆడెపు గంగాధర్, కండ్లకోయ గంగాధర్, కవిత, అలీ ఇమ్రాన్, రజాక్, భానుచందర్, అజిత్‌సింగ్, రాధాకుమార్, గంగాసాగర్, దేవానంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ నగర ఇన్‌ఛార్జి వై ఓమయ్య, నాయకులు రాజన్న, ఎండీ రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నిజామాబాద్ సిటీ: యోగా ప్రతిఒక్కరికి ఎంతో అవసరమని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధిస్తామని నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీ హనుమాన్ ఆరోగ్య అధ్యాత్మిక ట్రస్ట్ ఆధ్వర్యంలో రామకృష్ణ విద్యా నికేతన్ ఆవరణలో శ్రీ హనుమాన్ యోగ ధ్యాన కేంద్రం రథసప్తమి సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలో యోగా చేయాలని సూచించారు. అప్పుడే పరిపూర్ణమైన ఆరోగ్యం పొందుతారన్నారు. శ్రీకృష్ణానంద్ యాదవ్, ఎస్ఎస్ చారి, మధుచారి, రుక్మణ్‌రావు, రత్నాకర్, అంబేటి మన్మోహన్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుమారి దేవి మనోజ్ఞ చేసిన నృత్యం అలరించింది.

కులాల అభివృద్ధిలో ఉద్యోగులు కీలకం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రంలో ఉన్న ఆయా కుల సంఘాల అభివృద్ధిలో ఉద్యోగుల కృషి ఎంతగానో ఉందని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు వ్యాఖ్యానించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడ్ల నాగరాజు ఎన్నికైన సందర్భంగా ఆదివారం మాల విద్యుత్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల సంఘాలు అభివృద్ధి చెందాలంటే ఉద్యోగుల సాయ సహకారాలు చేయటం కీలకమన్నారు. ప్రతి ఒక్కరు ఈ దిశగా కృషి చేయాలన్నారు. నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సెక్రటరీ అశోక్ కుమార్, సలహాదారులు పోశెట్టి, కైలాస్ కుమార్ కార్యవర్గ సభ్యులు గంగాధర్, సోమేశ్, సంజీవ్, కాంతారావు పాల్గొన్నారు.

కిరాణ సామగ్రి అందజేత



నిజామాబాద్‌నాగారం: నాగారం ప్రాంతంలోని శ్రీరామ్‌నగర్‌లో ఓ కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్న గడ్డం కిరణ్ సెంట్రింగ్ పని చేస్తుంటాడు. పని చేస్తున్న సమయంలో సలాక తెగి కాలుకు పుండు ఏర్పడింది ఇన్ఫెక్షన్ సోకి మోకాలు కింది వరకు తీసేశారు. భార్య కూలి. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పూట గడవడం కష్టమవడంతో శ్రీలక్ష్మీచేయూత సేవా సమితిని ఆశ్రయించారు. వెంటనే స్పందించి ఆదివారం గడ్డం కిరణ్ ఇంటికి వెళ్లి వీల్ చైర్‌తో పాటు రెండు నెలలకు సరిపడా కిరాణా సామగ్రిని కుటుంబానికి అందజేశారు. ప్రధాన కార్యదర్శి అలువాల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సీహెచ్ బాలరాజు, కోశాధికారి సీహెచ్ భూషణ్ చారి, రవీందర్, శ్యామ్, సతీష్, రాజశేఖర్, నంద కిషోర్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



సిరికొండ: మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు గ్రామస్తులు పూజలు చేశారు. గ్రామ దేవతలైన పోచమ్మ, పోతలింగన్న, అంపెల్లి పోశవ్వల గద్దెల వద్ద కల్లు శాకలు పోసి బెల్లం, పేలాలను నైవేద్యంగా సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతా బాగా ఉండాలని భక్తులు అమ్మవార్లను వేడుకున్నారు.

కేసీఆర్ మాట తప్పారు

కోటగిరి: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు రూ.3 వేలకు నెలసరి వేతనం పెంచుతామని సీఎం కెసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించి మాట తప్పారని, అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకుని కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ.. ఏజెన్సీ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని పేర్కొన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నన్నే సాబ్, ప్రతినిధులు నీరడి భూమయ్య, కార్మికులు రమణమ్మ పాల్గొన్నారు.

బీడీ కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఎలాంటి షరతులు లేకుండా రూ.2016 జీవనభృతి కోసం బీడీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు పిలుపునిచ్చారు. ఆదివారం సిర్‌పూర్‌లో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధిరాములు మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీడీ పరిశ్రమలో పని చేస్తున్న ప్రతిఒక్కరికీ రూ.2016 జీవనభృతి ఇస్తామని సీఎం కేసీఆర్ హామీనిచ్చినా.. నేటికీ అమల్జేయడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బీడీ పరిశ్రమపై పెట్టిన ఆంక్షలు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీడీ కార్మికులకు జీవనభృతికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు సయ్యద్, ముత్యాల సత్యం, పిప్పరవేణి విజయ, కవిత, మౌనిక, సంధ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీడీ కార్మికులు, నాయకులు

మహిళల హక్కుల కోసం పోరాటం

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్

ధర్పల్లి: నేటి సమాజంలో స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాటం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. దుబ్బాకలో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) 8వ జిల్లా మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలకు పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు హాజరై అధ్యక్షత వహించారు. భాస్కర్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ప్రవేశపెట్టినా, అవి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయన్నారు. అనంతరం పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభద్ర మాట్లాడుతూ.. పురుషులతో పాటు మహిళలకు సమాన గౌరవాన్ని ఇవ్వాలని కోరారు. పీవోడబ్ల్యూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయకులు జయ, సవిత, జ్యోతి, అనిత, గంగామణి, లత, రాధ పాల్గొన్నారు.


దుబ్బాకలో మాట్లాడుతున్న భాస్కర్

ఏసీడీ చార్జీల వసూళ్లను నిలిపేయాలి



సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థలు పేదల నుంచి ఏసీడీ ఛార్జీల పేరుతో చేస్తున్న వసూళ్లను వెంటనే నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8 ఏళ్లుగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో విచ్చలవిడిగా పెంచుతున్న విద్యుత్ ఛార్జీలు సామాన్యులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. ఛార్జీలు పెంచడమే కాకుండా టారిఫ్ రేట్లు మార్చడం, యూనిట్ల స్లాబ్‌లు మార్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతేడాది లోడ్ డిపాజిట్ పేరుతో ఒక్కో సర్వీస్ మీటర్‌పై రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. మళ్లీ ఏసీడీ డిపాజిట్ల పేరుతో రెండు నెలల విద్యుత్ బిల్లులు అడ్వాన్స్ డిపాజిట్ చేయాలని పేర్కొనడం సరికాదన్నారు. వెంటనే ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే ప్రజలందరిని కలుపుకుని ప్రభుత్వ దమననీతిని ఎదురిస్తామని హెచ్చరించారు. నాయకులు వేల్పూర్ భూమయ్య, నీలం సాయిబాబా, దేశెట్టి సాయిరెడ్డి పాల్గొన్నారు.

'దళిత బంధు'లో ప్రాధాన్యత ఇవ్వాలి

- ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం

నిజామాబాద్‌నాగారం: దళిత బంధులో కేవలం మాల, మాదిగలకే కాకుండా దళితుల్లో ఉపకులాలైన 57 కులాల వారికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు చింతల రాజలింగం అన్నారు. ఆదివారం నగరంలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతీ నియోజక వర్గంలో ఇచ్చిన వంద మందిలో ఒక్క ఉప కులానికి చెందిన వారికి ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మా(30 లక్షల) ఉపకులాల ప్రజలపై దృష్టి సారించాలన్నారు. దళిత బంధులో తమిళనాడు తరహాలో 3 శాతం ప్రత్యేక జీవో జారీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కెర భూమన్న మాట్లాడుతూ.. ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు ఏర్పుల యాదయ్య బైండ్ల, చిందు నంబూద్రి ప్రసాద్, కర్నే ముత్యాలు డక్కలి, చిత్తరి సాయమ్మ, సాయి ప్రసాద్, గంగాధర్, ఎల్లవ్వ, కడమారి సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎస్సీ ఉపకులాల నేతలు

బడా రాంమందిరంలో గో-వృషభ కల్యాణోత్సవం

నిజామాబాద్ సిటీ: ఇందూరు గోసేవా సమితి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని బడారాంమందిరం(గాజుల్‌పేట్)లో శివ పార్వతుల కల్యాణం, గో-వృషభ కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఇందూర్ గోసేవా సమితి అధ్యక్షుడు వీరమల్లి రమేష్ దంపతులు భక్తి శ్రద్ధలతో కల్యాణం జరిపించారు. గో సేవా భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, గో భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.


కల్యాణం జరిపిస్తున్న గోసేవా సమితి ప్రతినిధులు

మల్లెపూల నరేంద్రకు ఘన నివాళి



నిజామాబాద్‌నాగారం: జర్నలిస్టు మల్లెపూల నరేంద్ర 32వ వర్ధంతిని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. నరేంద్ర చిత్రపటానికి ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజలింగం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తే దైవంగా భావించి ప్రాణాలు సైతం లెక్క చేయకుండా వార్తల సేకరణకు వెళ్లిన నరేంద్ర జర్నలిస్టుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. జర్నలిస్టు వృత్తే కత్తి మీద సాములాంటిదన్నారు. అలాంటి వృత్తిలో మనం సమాజ శ్రేయస్సు కోసం తన వంతుగా కృషి చేయాలన్నారు. నరేంద్ర స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కథనాలు రాసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి నర్సయ్య, జర్నలిస్టులు ప్రభాకర్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,150	వెండి (కిలో)	71,000
22 క్యారెట్స్	53,600	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	10	క్యాప్సికం	30	50
బెండకాయ	60	80	గాజరుగడ్డ	25	40
జీరకాయ	50	70	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
జిర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	35	50	గోబిపువ్వు	15	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్-1-పఠాన్ (హిందీ)-10.35,1.30,4.20 7.15,10.10
స్క్రీన్-2- వాల్తేరు వీరయ్య -10.20
వీరసింహారెడ్డి -1.20,4.30,10.30
స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -1.30,4.30,7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 -పఠాన్ - (హిందీ),9.30,12.45 4.00,7.15,10.30
స్క్రీన్-2 పఠాన్-(హిందీ)-10.00,1.15
7.45,11.00 -పఠాన్-(తెలుగు).4.30
స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -10.15,1.35 7.20,10.40
-వాలెంటైన్స్ నైట్-(తెలుగు)-4.55
స్క్రీన్-4- హంట్-(తెలుగు),10.15,10.50
మల్లికాపురం(తెలుగు),1.15
వీరసింహారెడ్డి,3.50
వారసుడు,7.20

దేవి	వీరసింహారెడ్డి
నటరాజ్	పఠాన్(హిందీ)
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	ధమాకా
విజయ్	పఠాన్ (తెలుగు)